
సాక్షి
మెదక్
శనివారం । 11 । నవంబర్ । 2023



బాద్‌షా ఎవరో?
రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. అభివృద్ధిపై ఒకరు, పథకాలపై మరొకరు ఓటర్లకు వివరిస్తూ ముందుకు సాగుతున్నారు.
వివరాలు IIలో ▸



క్రీడల్లో రాణించాలి
క్రీడలు విద్యార్థుల జీవితాల్లో అంతర్భాగం కావాలని భూపరిపాలనశాఖ ముఖ్య కార్యదర్శి నవీన్‌మిట్టల్ అన్నారు.
వివరాలు IIలో ▸



కొనుగోళ్లు సజావుగా సాగాలి
రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోళ్లు సజావుగా జరిగేలా చూడాలని అధికారులు సూచించారు.
వివరాలు IIIలో ▸

న్యూస్‌రీల్

సీఎం సభాస్థలి పరిశీలన



సీఎం సభ కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి హరీశ్‌రావు తదితరులు

నర్సాపూర్: ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈనెల 16వ తేదీన సీఎం కేసీఆర్ పాల్గొనున్న బహిరంగ సభ ఏర్పాటుకు మంత్రి హరీశ్ రావు, బీఆర్‌ఎస్ నర్సాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థి సునీతారెడ్డి, ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, ఎమ్మెల్సీ వెంకట్రాంరెడ్డి శుక్రవారం స్థల పరిశీలన చేశారు. నర్సాపూర్ – వెల్దుర్తి మార్గంలోని ఓ వెంచర్ తోపాటు పక్కనే గల వ్యవసాయ భూములను పరిశీలించారు. కాగా సీఎం సభకు భారీ ఎత్తున ప్రజలు వచ్చే విధంగా ప్రణాళిక రూపొందించాలని నాయకులకు సూచించారు.

మద్యం చట్టబద్ధతకు వేరిట్ యాప్

జిల్లా ఎక్సైజ్ అధికారి అబ్దుల్ రజాక్



ఎన్నికల అధికారులతో మాట్లాడుతున్న ఎక్సైజ్ అధికారి అబ్దుల్ రజాక్

మెదక్ కలెక్టరేట్: మద్యం చట్టబద్ధత కోసం వేరిట్ యాప్‌ని ఉపయోగించాలని జిల్లా ఎక్సైజ్ అధికారి అబ్దుల్ రజాక్ అన్నారు. శుక్రవారం ఆయన జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకుడు సంజయ్ కుమార్, జిల్లా పోలీసు పరిశీలకుడు సంతోష్ కుమార్ తుకారాం, కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ రోహిణి ప్రియదర్శినిలను మర్యాద పూర్వకంగా కలిసి మద్యం విధి విధానాలు తెలిపారు. అలాగే వైన్‌షాపులు, రెస్టారెంట్లు, బార్లు, సీసీ కెమెరాల పనితీరు, ఐఎంఎల్ అమ్మకాల తీరు, మద్యం ఉత్పత్తి, బాట్లింగ్ సమస్యలు వివరించారు. వేరిట్ యాప్‌తో క్యూఆర్, బార్‌కోడ్‌లను సులభంగా స్కాన్‌చేసి వివరాలు తెలుసుకోవచ్చన్నారు.

చెక్‌పోస్టుల ఆకస్మిక తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ రోహిణి ప్రియదర్శిని

మెదక్ మున్సిపాలిటీ: /రామాయంపేట/ నిజాంపేట(మెదక్): సాధారణ ఎన్నికల నేపథ్యంలో జిల్లా సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్టులను ఎస్పీ రోహిణి ప్రియదర్శిని శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు ఏర్పాటు చేసిన చెక్ పోస్టులు చాలా కీలకమన్నారు. జిల్లాలోని ఏడు చెక్‌పోస్టుల వద్ద సాయుధ బలగాలతో పహారా కాస్తున్నట్లు తెలిపారు. అనంతరం వాహనాల నమోదు రిజిస్టర్, వాహన తనిఖీల తీరును పరిశీలించారు. తనిఖీల సమయంలో సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.

విద్యార్థులకు చదువు, సంస్కారం అవసరం

జిల్లా ఇంటర్ విద్యాధికారి సత్యనారాయణ



మాట్లాడుతున్న జిల్లా ఇంటర్ విద్యాధికారి సత్యనారాయణ

రామాయంపేట(మెదక్): విద్యార్థులకు చదువుతోపాటు మంచి సంస్కారం అవసరమని జిల్లా ఇంటర్ విద్యాధికారి సత్యనారాయణ అన్నారు. స్నేహ కళాశాలలో జూనియర్ విద్యార్థులకు స్వాగతం పేరిట శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. సమాజంలో మార్పు విద్యార్థుల చేతుల్లోనే ఉందని, సంస్కారంలేని చదువు వ్యర్థమన్నారు. అనంతరం స్నేహ విద్యాసంస్థల చైర్మన్ వలిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు మంచి సంస్కృతిని అలవర్చుకోవాలన్నారు. సమాజానికి మంచి పౌరులను పరిచయం చేయాల్సిన బాధ్యత అధ్యాపకులపై ఉందన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రొఫెసర్ శంకర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు ఓటేస్తే ఆగమే

- ఆ పార్టీ మాయమాటలు నమ్మొద్దు
- కేసీఆర్‌పై ప్రజలకు నమ్మకం
- మంత్రి హరీశ్‌రావు
- బీఆర్‌ఎస్ అభ్యర్థి సునీతారెడ్డి నామినేషన్ దాఖలు



మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

నర్సాపూర్: ముఖ్యమంత్రి కేసీఆర్‌పై రాష్ట్ర ప్రజలకు నమ్మకం ఉందని, కాంగ్రెస్‌కు ఓటేస్తే ఆగమవుతారని ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి టి.హరీశ్‌రావు అన్నారు. శుక్రవారం నర్సాపూర్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సునీతారెడ్డి మంత్రి హరీశ్‌రావుతో కలిసి నామినేషన్ పత్రాలు దాఖలు చేసేందుకు భారీ ర్యాలీతో వెళ్లారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ అంటే వంచన.. మోసమని, కేసీఆర్ అంటే నమ్మకం అని పేర్కొన్నారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే రాష్ట్రం ఆగమైతదని, ఆ పార్టీ నాయకులు మాయ మాటలు చెప్తారని విమర్శించారు. కాంగ్రెస్ వస్తే కరెంట్ కట్ అవుతుందని విమర్శించారు. కొడంగల్‌లో తాను ఓడిపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటానని గతంలో చెప్పిన పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి.. 2018లో కాంగ్రెస్ అధికారంలోకి రాకుంటే తాను గడ్డం తీసుకోనని ఆ పార్టీ నాయకుడు ఉత్తంకుమార్‌రెడ్డి ప్రకటించి మాట తప్పారని విమర్శించారు. మాట తప్పే నాయకులు కావాలా మాట మీద ఉండే కేసీఆర్ అవసరమా ఆలోచించాలని కోరారు. రేవంత్‌రెడ్డి పట్టపగలు రూ.50లక్షలు లంచం ఇస్తూ దొరికారని ఆరోపించారు. రైతులను కేసీఆర్ రాజులుగా చేస్తే రైతు బంధు బిచ్చమేసినట్లుగా ఉందని రేవంత్‌రెడ్డి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టో ఉత్తదేనని, కేసీఆర్ మాట మీద ఉంటారని చెప్పారు. రాష్ట్రంలో బీజేపీ డకౌట్ అవుతుందని, కాంగ్రెస్ రనౌట్ అవుతుందని, కేసీఆర్ సెంచరీ చేస్తారని హరీశ్ జోస్యం చెప్పారు.

నర్సాపూర్‌ను మరింత అభివృద్ధి చేస్తాం

నర్సాపూర్‌ను మరింత అభివృద్ధి చేస్తామని మంత్రి హరీశ్‌రావు అన్నారు. రైతులు ఈలవేస్తే కొండపోచమ్మ గేట్లు ఎత్తి నీళ్లు అందిస్తున్నారని, హల్దీవాగు నిండటంతో ఎకరం పొలం ఎండటం లేదన్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి సునీతారెడ్డి మంత్రిగా పనిచేశారని, ఆమెను గెలిపిస్తే నర్సాపూర్ అభివృద్ధి చెందుతుందన్నారు. సీఎం కేసీఆర్ నర్సాపూర్ వచ్చినప్పుడు పట్టణ అభివృద్ధికి రూ.65 కోట్లు విడుదల చేశారని గుర్తుచేస్తూ పట్టణాన్ని మరింత అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ అభ్యర్థి ఆవుల రాజిరెడ్డి ఇంతవరకు గ్రామ పంచాయతీ వార్డు మెంబరుగా గెలవలేదని, ఆయన ఏమి చేస్తారని ప్రశ్నించారు. నర్సాపూర్ నియోజకవర్గంలోని పార్టీ కార్యకర్తలు, నాయకులు సమష్టిగా సునీతారెడ్డి గెలుపు కోసం కృషి చేయాలన్నారు. నర్సాపూర్‌లో సునీతారెడ్డిని గెలిపిస్తే అక్కడ కేసీఆర్ సీఎం అవుతారన్నారు. రాబోయే ఎంపీ ఎన్నికల్లో ఎమ్మెల్యే మదన్‌రెడ్డిని ఎంపీగా పోటీ చేయిస్తామని చెప్పారు. సునీతారెడ్డిని 60 వేల మెజారిటీతో గెలిపించే బాధ్యత మదన్‌రెడ్డితో పాటు నియోజకవర్గంలోని కార్యకర్తలదన్నారు. అలాగే ఎంపీ ఎన్నికల్లో నర్సాపూర్‌లో లక్ష మెజార్టీ తేవాల్సిన బాధ్యత సునీతారెడ్డిపై ఉంటుందన్నారు. తాను సిద్దిపేటలో లక్ష మెజార్టీ ఇస్తానని ప్రకటించారు. అనంతరం సునీతారెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు జీవితాంతం సేవ చేస్తానన్నారు. ర్యాలీలో ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, రాష్ట్ర కార్మిక బోర్డు చైర్మన్ దేవేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ వెంకట్రాం రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్లను సిద్ధం చేయండి

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షిషా



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా

మెదక్ కలెక్టరేట్: సాధారణ ఎన్నికల నేపథ్యంలో అత్యవసర సేవలందిస్తున్న 12 విభాగాల సిబ్బంది కోసం పోస్టల్ బ్యాలెట్‌లను సిద్ధం చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఎన్నికల నోడల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యవసర సేవల విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి ఓటు వేసే అవకాశం కల్పించే విధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. విద్యుత్, అగ్నిమాపక, రవాణా, బీఎస్‌ఎన్‌ఎల్, రైల్వే, వైద్య, ఆర్‌ఓ, పీఓ, ఏపీఓ, పోలీస్, డ్రైవర్లు, ఎఫ్‌ఎస్‌టీ, ఎస్‌ఎస్‌టీ, వీఎస్‌టీ, రెవెన్యూ, అత్యవసర శాఖల సిబ్బంది ఫారం–12(డి) పూర్తి చేసి తమ నియోజకవర్గాల అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఇందుకు అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. పోలింగ్ రోజున పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటు వేసేందుకు వీలు పడని వారు పోస్టల్ బ్యాలెట్ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. ఈ మేరకు రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ప్రత్యేకంగా పోస్టల్ ఓటింగ్ సెంటర్ (పీవీసీ) అందుబాటులో ఉంటుందని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్‌లు రమేశ్, వెంకటేశ్వర్లు, డీఆర్‌ఓ పద్మశ్రీ, జిల్లా ఎన్నికల నోడల్ అధికారులు పాల్గొన్నారు.

ముగిసిన నామినేషన్లు

- మెదక్‌లో 18 మంది అభ్యర్థులు 29 సెట్లు దాఖలు
- పద్మాదేవేందర్‌రెడ్డి 4, రోహిత్ 3, పంజావిజయ్ 2 సెట్లు అందజేత

మెదక్: శాసనసభ ఎన్నికల నేపథ్యంలో ఈనెల 3వ తేదీ నుంచి శుక్రవారం వరకు మెదక్ అసెంబ్లీ నియోజకవర్గానికి 18 మంది అభ్యర్థులు 29 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. ఇందులో బీఆర్‌ఎస్ అభ్యర్థి సిట్టింగ్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి 4 సెట్లు వేయగా, కాంగ్రెస్ అభ్యర్థి మైనంపల్లి రోహిత్‌రావు 3 సెట్లు వేశారు. అలాగే బీజేపీ అభ్యర్థి పంజావిజయ్ కుమార్ 2 సెట్ల చొప్పున నామినేషన్లు దాఖలు చేశారు. 13వ తేదీన నామినేషన్ల పరిశీలన, 15వ తేదీన ఉపసంహరణ, అభ్యర్థుల తుది జాబితా అదేరోజు వెలువడుతుందని ఎన్నికల రిటర్నింగ్ అధికారి తెలిపారు.

స్వతంత్ర అభ్యర్థిగా మైనంపల్లి వాణి

మెదక్ కాంగ్రెస్ అభ్యర్థిగా మైనంపల్లి రోహిత్‌రావు 3 సెట్లు నామినేషన్ దాఖలు చేయగా, ఆయన తల్లి మైనంపల్లి వాణి ఆఖరిరోజైనా శుక్రవారం స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేశారు. కుమారుడు ప్రధాన పార్టీ కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో ఉంటే, తల్లి ఎందుకు స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేసిందని మెదక్‌లో చర్చనీయాంశమైంది. ఈ విషయంపై రోహిత్‌ను సంప్రదించేందుకు ప్రయత్నం చేయగా ఆయన అందుబాటులోకి రాలేదు.

నర్సాపూర్ నుంచి 16 మంది..

నర్సాపూర్: నర్సాపూర్ శాసనసభ నియోజక వర్గం నుంచి 16 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం నాటికి 16 మంది అభ్యర్థులు 29 నామినేషన్లు దాఖలు చేశారని, కొందరు ఎక్కువ సెట్ల నామినేషన్లు దాఖలు చేసినట్లు చెప్పారు.

చివరి రోజు 11 మంది ..

అసెంబ్లీ ఎన్నికలకు నామినేషన్ల చివరి రోజైన శుక్రవారం 11 మంది 14 నామినేషన్లు దాఖలు చేసినారని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీనివాసులు తెలిపారు. బీజేపీ అభ్యర్థిగా మురళీధర్‌యాదవ్, కాంగ్రెస్ అభ్యర్థిగా ఆవుల రాజిరెడ్డి, బీఆర్‌ఎస్ అభ్యర్థిగా వాకిటి సునీతారెడ్డి తమ నామినేషన్లు దాఖలు చేశారు. బీఎస్పీ అభ్యర్థిగా కుతాడి నర్సింహులు, యుగతులసి పార్టీ అభ్యర్థిగా పిట్ల నవీన్‌కుమార్, భారతీయ చైతన్య యువజన పార్టీ అభ్యర్థిగా ఆగమయ్య, స్వతంత్ర అభ్యర్థులుగా మాధవి, పిల్లుట్ల లక్ష్మి, లకావత్ రమేష్, బిడిమిట్ల లక్ష్మి నామినేషన్ దాఖలు చేశారు. కాగా గతంలో కాంగ్రెస్ అభ్యర్థిగా నామినేషన్ వేసిన గాలి అనిల్‌కుమార్ శుక్రవారం స్వతంత్ర అభ్యర్థిగా మరో నామినేషన్ దాఖలు చేయడం గమనార్హం.

కేసీఆర్‌కు ఓటుతో బుద్ధి చెప్పాలి

బీజేపీ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్



మాట్లాడుతున్న బీజేపీ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్

నర్సాపూర్ రూరల్: నిరుద్యోగ యువతీ యువకులు కేసీఆర్‌కు ఓటుతో బుద్ధి చెప్పాలని బీజేపీ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ అన్నారు. శుక్రవారం ఆయన నర్సాపూర్‌లో బీజేపీ అభ్యర్థి మురళీధర్ యాదవ్ నామినేషన్‌లో భాగంగా నిర్వహించిన రోడ్ షోలో మాట్లాడారు. నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామంటూ నోటిఫికేషన్ వేసి పేపర్లు లీకు చేయించిన ఘనత కేసీఆర్‌దన్నారు. నిరుద్యోగ భృతి, ఇంటికో ఉద్యోగం, దళిత బంధు, బీసీ బంధు పేరుతో ప్రజలను మోసం చేస్తున్నాడని ఆరోపించారు. తనను ఓడించేందుకు హుజూరాబాద్ నియోజకవర్గంలో పూర్తిస్థాయిలో దళిత బంధు, ఇతర బంధులు ఇవ్వడం జరిగిందన్నారు. నాలుగేళ్లుగా మహిళలకు వడ్డీ లేని రుణాలు ఇవ్వడం లేదని, రైతు రుణమాఫీ సైతం ఇవ్వకుండా మోసం చేశారన్నారు. దుబ్బాకలో బీజేపీకి ఓట్లే లేవన్న రాహుల్ గాంధీకి అక్కడి ఓటర్లు బీజేపీని గెలిపించారన్నారు. కేసీఆర్ మాటలకు చేతలకు పొందన లేదన్నారు. రైతు కూలీలకు సైతం రూ.5 లక్షల బీమా ఇచ్చి ఆదుకుంటామన్నారు. మురళీధర్ యాదవ్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

పంటకోత ప్రయోగంతోనే దిగుబడి అంచనా

- జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి కృష్ణయ్య



ధాన్యం తూకం వేస్తున్న సీపీఓ కృష్ణయ్య

చిలప్‌చెడ్(నర్సాపూర్): పంటకోత ప్రయోగంతోనే దిగుబడి అంచనా సరిగా వేయొచ్చని జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి కృష్ణయ్య అన్నారు. శుక్రవారం చిలప్‌చెడ్ మండలం అంతారం గ్రామంలో ఆయన పంటకోత ప్రయోగం నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ రైతు అంబటి వెంకటేశం పొలంలో 5 మీటర్ల పొడవు, 5 మీటర్ల వెడల్పు స్థలంలో పంటను కోసి ధాన్యం తూకం వేసి దిగుబడి అంచనా వేశామన్నారు. కార్యక్రమంలో మండల గణాంక అధికారి వెంకటేశ్, మెదక్ ఎఎస్‌ఓ సురేశ్, రైతులు పాల్గొన్నారు.

కేసీఆర్ తరఫున రెండో సెట్టు దాఖలు

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండలం బొబ్బాయిపల్లికి చెందిన ఎస్‌ఆర్‌ఈజీఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు కోల సద్గుణ శుక్ర వారం బీఆర్‌ఎస్ గజ్వేల్ అభ్యర్థి, సీఎం కేసీఆర్ తరుపున రెండో నామినేషన్ సెట్టును అందించారు.

ఓట్ల లెక్కింపు కోసం ఏర్పాట్లు చేయండి

ఎన్నికల పోలీస్ పరిశీలకుడు సంతోష్ కుమార్ తుకారాం



రికార్డులు పరిశీలిస్తున్న ఎన్నికల పోలీసు పరిశీలకుడు సంతోష్ కుమార్ తుకారాం

మెదక్ మున్సిపాలిటీ: ఓట్ల లెక్కింపు కోసం పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఎన్నికల పోలీస్ పరిశీలకుడు సంతోష్ కుమార్ తుకారాం ఆదేశించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని బాయ్స్ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంలను, ఓట్ల లెక్కింపు కోసం ఏర్పాటు చేసిన వైపీఆర్ కళాశాలను సందర్శించారు. ఆయనకు ఏర్పాట్ల వివరాలను ఎస్పీ రోహిణి ప్రియదర్శిని వివరించారు. పోలింగ్ ముగిసిన అనంతరం ఈవీఎంలను భద్రపరిచేందుకు భద్రతా పరమైన అంశాలకు తీసుకుంటున్న చర్యలు తెలిపారు. కార్యక్రమంలో మెదక్ డీఎస్పీ ఫణీంద్ర, మెదక్ పట్టణ సీఐ వెంకట్, మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్ రెడ్డి, హవేలిఘనపూర్ ఎస్‌ఐ ఆనంద్‌గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.



మెప్మా ఆధ్వర్యంలో వెలిగించిన దీపాలు

స్వచ్ఛ దీపోత్సవం

సిద్దిపేట మున్సిపాలిటీలో స్వచ్ఛ దీపోత్సవం చేపట్టారు. దీపావళి పండుగ సందర్భంగా శుక్రవారం ముందస్తుగా మెప్మా ఆధ్వర్యంలో పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్ జ్యోతి ప్రజ్వలన చేశారు. మెప్మా పరిధిలో పనిచేసే మహిళలు, ఆర్పీలు, సీఓలు పెద్ద ఎత్తున దీపాలను వెలిగించారు. స్వచ్ఛ దీపావళి అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని, బల్దియా ఆదర్శంగా ఉండాలని కమిషనర్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో మెప్మా సీఓ రమ్య, ఆర్పీ మమత తదితరులు పాల్గొన్నారు.

– సిద్దిపేటజోన్

రూ.10 లక్షలు మాయం

- వెలుగులోకి మరో సైబర్ మోసం
- విద్రోహశక్తులతో సంబంధాలున్నాయంటూ బెదిరింపు
- పోలీసులను ఆశ్రయించిన బాధితుడు

పటాన్‌చెరు టౌన్: మరో సైబర్ మోసం వెలుగుచూసింది. సంఘ విద్రోహ శక్తులతో సంబంధాలున్నాయంటూ బెదిరించి ఏకంగా రూ.10లక్షలు కాజేశారు. ఈ సంఘటన అమీన్‌పూర్‌లో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం అమీన్‌పూర్‌కు చెందిన ఓ వ్యక్తికి అక్టోబర్ 6న నీకు సంఘ విద్రోహ శక్తులతో సంబంధాలున్నాయని, లక్నో కస్టమ్స్ కార్యాలయం నుంచి కాల్ చేస్తున్నామని, నీకోసం ఢిల్లీ పోలీసులు వస్తున్నారని బెదిరించారు. ఆ తరువాత అపరిచిత వ్యక్తి బాధితునికి మెసేజ్ రూపంలో ఓ లింకు పంపి దాన్ని క్లిక్ చేసి వచ్చిన ఓటీపీని చెప్పమన్నాడు. దీంతో బాధితుడు అపరిచిత వ్యక్తి చెప్పిన విధంగా లింకు ద్వారా వచ్చిన ఓటీపీని చెప్పగా అతని బ్యాంక్ ఖాతాలో ఉన్న రూ.పది లక్షలు మాయమయ్యాయి. దీంతో బాధితుడు ముందుగా సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేసి అనంతరం అమీన్‌పూర్ పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్రెడిట్ కార్డ్ రివార్డ్స్ గడువు ముగుస్తుందని చెప్పి..

క్రెడిట్ కార్డ్ రివార్డ్స్ గడువు ముగుస్తుందని వాటిని అప్‌డేట్ చేసుకోవాలని వచ్చిన మెసేజ్ కు స్పందించి బాధితులు రూ.లక్షా 20 వేలు పోగొట్టుకున్న ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానిక పీజేఆర్ కాలనీకి చెందిన ఓ వ్యక్తికి అక్టోబర్ 9న తన ఫోన్‌కు రివార్డ్స్ సంబంధించిన మెసేజ్ వచ్చింది. బాధితుడు మెసేజ్ కు స్పందించి లింక్ క్లిక్ చేశాడు. దీంతో అతడి ఖాతాలో ఉన్న రూ.లక్షా 20 వేలు మాయమయ్యాయి. దీంతో బాధితుడు తాను మోసపోయినట్టు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

జిల్లా విద్యాధికారి రాధా కిషన్



పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు

మెదక్ కలెక్టరేట్: విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించాలని డీఈఓ రాధాకిషన్ అన్నారు. శుక్రవారం జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో మెదక్‌లోని గురుకుల పాఠశాలలో జిల్లాస్థాయి కళా ఉత్సవ్ పోటీలు నిర్వహించారు. జానపద నృత్య పోటీల(బాలుర)లో కుర్తివాడకు చెందిన విష్ణువర్ధన్, బాలికల విభాగంలో రేగోడ్ పాఠశాలకు చెందిన ధనలక్ష్మీ, శాస్త్రీయ నృత్యంలో వెంకటలక్ష్మి(సర్ధన), జానపద పాటల పోటీల్లో మనోహర్(కొత్తపల్లి), కీర్తన(టీఎంఆర్జేసి, మెదక్), శాస్త్రీయ పాటల పోటీల్లో స్వర్ణోదయ (టీఎస్‌డబ్ల్యూ ఆర్జేసీ రామాయంపేట), చిత్రలేఖనం పోటీల్లో నాగరాజు (మోడల్ స్కూల్, రెగోడ్), నందిని(టీఎస్‌ఆర్జేసి, మెదక్), విజువల్ త్రీడీ పోటీల్లో యశ్వంత్ (వెల్దుర్తి) ప్రతిభ చూపారు. అలాగే వాయిద్యాల పోటీలలో కారుణ్య(రామాయంపేట), అభిలాష్ (వెల్దుర్తి), ఏకపాత్రాభినయం పోటీల్లో సారిభా(టీఎస్‌ఆర్జేసి, పెద్దశంకరంపేట) ప్రథమ స్థానాల్లో నిలిచారు. ఈ పోటీలు విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి సతీష్ కుమార్ పర్యవేక్షణలో జరిగాయి. పోటీల్లో గెలుపొందిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయగా, వారిని డీఈఓ అభినందించారు. పోటీలకు న్యాయనిర్ణేతలుగా అంజాగౌడ్, నర్సింగరావు, రమణ కుమార్, ప్రవీణ్, ధనుంజయచారి, నాగరాజు, శాలిని, వంశీ, శశిధర్, శ్రీనివాస్ వ్యవహరించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, సాంఘిక సంక్షేమ పాఠశాల ప్రిన్సిపాల్ వరలక్ష్మీ పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన



మెదక్ కలెక్టరేట్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర నూతన ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఓటు హక్కు వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీఈఓ రాధాకిషన్, జిల్లా స్వీప్ అధికారి రాజిరెడ్డి విద్యార్థులకు ఈవీఎం, బ్యాలెట్, వీవీప్యాట్‌లపై అవగాహన కల్పించారు. ఓటువేసే విధానం, బ్యాలెట్ పత్రం తదితర అంశాలను విద్యార్థులకు వివరించారు.

క్లుప్తంగా

పొన్నం ఓటమి ఖాయం

హుస్నాబాద్: కాంగ్రెస్ అభ్యర్థి పొన్నం ప్రభాకర్ కరీంనగర్ నుంచి మూడుసార్లు పోటీ చేస్తే అక్కడి ప్రజలు ఓడిస్తే ఇక్కడికి వచ్చాడని నాలుగోసారి కూడా ఓడిపోవడం ఖాయమని బీఆర్ఎస్ అభ్యర్థి సతీష్‌కుమార్ అన్నారు. హుస్నాబాద్ పట్టణంలోని 8, 9, 18, 19వ వార్డుల్లో శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సతీష్‌కుమార్ మాట్లాడుతూ కరీంనగర్‌లో చెల్లని రూపాయి ఇక్కడ ఎలా చెల్లుతుందన్నారు. వేల కోట్ల రూపాయలతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశామని, మళ్లీ నన్ను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, వైస్ చైర్ పర్సన్ అయిలేని అనిత, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అన్వర్ పాష, తదితరులు పాల్గొన్నారు.

కుంటుపడిన అభివృద్ధి

హుస్నాబాద్: పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీష్‌కుమార్ వైఫల్యాలపై ప్రజలకు అవగాహన కల్పించడం కోసం చార్జిషీట్ విడుదల చేస్తున్నట్లు హుస్నాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి పొన్నం ప్రభాకర్ అన్నారు. పార్టీ కార్యాలయంలో ఏడు మండలాల పార్టీ అధ్యక్షులతో కలిసి శుక్రవారం ఎమ్మెల్యే సతీష్‌కుమార్ వైఫల్యాలపై చార్జిషీట్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా పొన్నం మాట్లాడుతూ.. నియోజకవర్గంలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. హుస్నాబాద్‌ను సెంటిమెంట్‌గా తీసుకొని ఇక్కడ సీఎం కేసీఆర్ సభ నిర్వహించారని, డెవలప్‌మెంట్ మాత్రం సిద్దిపేట, గజ్వేల్‌కు పరిమితమైందన్నారు. సమావేశంలో టీపీసీసీ సభ్యుడు కేడం లింగమూర్తి, ఏడు మండలాల పార్టీ అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు ఓటు వేస్తే అమ్ముడుపోతారు

హుస్నాబాద్: కాంగ్రెస్‌కి ఓటు వేస్తే గెలిచిన తర్వాత అభ్యర్థులు అమ్ముడుపోతారని హుస్నాబాద్ నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొమ్మ శ్రీరాంచక్రవర్తి అన్నారు. చివరి రోజు నామినేషన్ ప్రక్రియలో భాగంగా పట్టణంలో పార్టీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా శ్రీరాంచక్రవర్తి మాట్లాడుతూ.. మా తండ్రి బొమ్మ వెంకటేశ్వర్లు ఈ ప్రాంతాన్ని ఎంతో అభివృద్ధి చేశారన్నారు. 20 ఏళ్లు మా తండ్రి, 20 ఏళ్లు తాను నియోజకవర్గ సమస్యలపై పోరాడిన చరిత్రఅని అన్నారు. బీజేపీకి ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి, పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు జన్నపురెడ్డి సురేందర్ రెడ్డి, కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, నియోజకవర్గ నాయకురాలు మంజుల రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేసీఆర్‌కు భారీ మెజార్టీ ఖాయం : వంటేరు

జగదేవ్‌పూర్(గజ్వేల్): గజ్వేల్ అసెంబ్లీ అభ్యర్థిగా మూడోసారి పోటీ చేస్తున్న సీఎం కేసీఆర్ భారీ మెజార్టీతో గెలవడం ఖాయమని ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని పీర్లపల్లి, ధర్మారం, కొత్తపేట, ఇటిక్యాల, లింగారెడ్డిపల్లి, బీజీ వెంకటాపూర్, తీగుల్, రాంనగర్ తదితర గ్రామాల్లో జగదేవ్‌పూర్ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి రాధాకృష్ణశర్మతో కలిసి శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గ్రామాల్లో మహిళలు బతుకమ్మలు, బోనాలతో ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా పలువురు ప్రతాప్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ లో చేరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, హౌజింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మడుపు భూంరెడ్డి, ఎంపీపీ బాలేశంగౌడ్, జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, ఆత్మ చైర్మన్ రంగారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు నరేశ్, ఏఎంసీ వైస్‌చైర్మన్ ఉపేందర్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు కిరణ్‌గౌడ్, కొండపోచమ్మ దేవాలయ పాలక మండలి చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్‌లు చంద్రశేఖర్, యాదవరెడ్డి, వెంకట్రాంరెడ్డి, మహిళా మండల అధ్యక్షురాలు, ఎంపీటీసీ కవిత, కావ్యదుర్గయ్య, కోఆప్షన్ సభ్యులు ఇక్బాల్, నాయకులు కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

బాద్‌షా ఎవరో?


ఒడితెల సతీష్‌కుమార్, బీఆర్ఎస్ అభ్యర్థి


పొన్నం ప్రభాకర్, కాంగ్రెస్ అభ్యర్థి


బొమ్మ శ్రీరాంచక్రవర్తి, బీజేపీ అభ్యర్థి


హుస్నాబాద్ పట్టణం వ్యూ

- ఉద్యమగడ్డపై ఆసక్తికర పోరు
- హ్యాట్రిక్ కోసం ఒకరు..
- మొదటిసారిగా గెలుపే లక్ష్యంగా మరో ఇద్దరు
- ప్రధాన పార్టీల మధ్య త్రిముఖ పోరు

హుస్నాబాద్: తెలంగాణ ఉద్యమ సమయంలో వెన్నుదన్నుగా సహాయ సహకారాలు అందించి, కేసీఆర్‌కు అత్యంత సన్నిహితంగా ఉన్న ఒడితెల కుటుంబం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థి సతీష్‌కుమార్ మూడోసారి ముచ్చటగా ఎమ్మెల్యేగా విజయం సాధించాలని శ్రమిస్తున్నారు. ఎలాగైనా ఈసారి గెలిచి అసెంబ్లీలో తన గళం విప్పాలని కాంగ్రెస్ అభ్యర్థి పొన్నం ప్రభాకర్ పట్టుదలతో ముందుకెళ్తున్నారు. అలాగే, మాజీ ఎమ్మెల్యే బొమ్మ వెంకటేశ్వర్లు వారసుడిగా మొదటిసారి ఎమ్మెల్యేగా బోణీ కొట్టి తండ్రి వారసత్వాన్ని పుణికిపుచ్చుకోవాలని బీజేపీ అభ్యర్థి బొమ్మ శ్రీరాంచక్రవర్తి ఉవ్విళ్లూరుతున్నారు. దీంతో హుస్నాబాద్‌లో ప్రధాన పార్టీల త్రిముఖ పోరుతో రాజకీయం రసవత్తంగా మారింది.

ఇందుర్తి నుంచి మొదలుకొని పునర్విభజనలో హుస్నాబాద్‌గా మారిన నియోజకవర్గంలోని ఓటర్లు ప్రతీ ఎన్నికల్లో విలక్షణమైన తీర్పు ఇస్తున్నారు. రెండుసార్లు పీడీఎఫ్, ఆరు సార్లు సీపీఐ, మూడు సార్లు కాంగ్రెస్ విజయం సాధించాయి. తెలంగాణ సాధన అనంతరం బీఆర్ఎస్(టీఆర్ఎస్) వరుసగా విజయాన్ని దక్కించుకున్నాయి.ఈసారి ఎన్నికల్లో పోటీ రసవత్తరంగా మారడంతో ఎవరు గెలుస్తారో అని అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

అభివృద్ధి, సంక్షేమమే గెలిపిస్తాయి

ఒడితెల సతీష్‌కుమార్ 2014, 2018 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 2023లో మూడోసారి ఎమ్మెల్యేగా గెలవాలని నియోజకవర్గంలో సుడిగాలి పర్యటన చేస్తున్నారు. సీఎం కేసీఆర్‌కు సెంట్‌మెంట్‌గా హుస్నాబాద్ నుంచే ఎన్నికల శంఖారావాన్ని పూరించారు. కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభతో గులాబీ శ్రేణుల్లో జోష్ నింపింది. అదే జోష్‌ను కొనసాగిస్తూ ఇప్పటికే సగం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలే తనను గెలిపిస్తాయని ధీమాతో ప్రచారాన్ని ఉధృతం చేశారు. పదేళ్లకాలంలో తాను చేసిన అభివృద్ధిని, సంక్షేమాన్ని వివరిస్తూ ప్రజల్లోకి వెళ్తున్నారు. 2018లో సతీష్‌కుమార్ దాదాపు 73 వేలకు పైచిలుకు మెజార్టీతో గెలుపొందారు. ఈసారి లక్ష మెజార్టీ సాధించాలనే లక్ష్యంతో వ్యూహాలకు పదును పెడుతూ ముందుకు నడుస్తున్నారు.

ఉద్యమకారుడిగా ప్రజల్లోకి...

హుస్నాబాద్ నుంచి మొదటిసారిగా పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ ఎమ్మెల్యేగా గెలుపొందాలని గట్టి పట్టుదలతో ఉన్నారు. కరీంనగర్ ఎంపీగా పని చేసిన అనుభవం, రాష్ట్ర సాధన కోసం ఉద్యమించిన నాయకుడిగా ప్రజల్లోకి వెళ్తున్నారు. పార్లమెంట్‌లో తెలంగాణ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించే విధంగా తెలంగాణ బిడ్డగా తన గళాన్ని వినిపించి పేపర్ స్ప్రేకు గురై తెలంగాణ ఉద్యమ నాయకుడిగా పేరు తెచ్చుకున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీ పథకాలను పక్కాగా అమలు చేస్తామని ప్రజలకు వివరిస్తూ ప్రచారం చేస్తున్నారు. అలాగే కాంగ్రెస్, సీపీఐ పొత్తుతో హుస్నాబాద్ సీటును కాంగ్రెస్‌కు కేటాయించిన విషయం విధితమే. సీపీఐ పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్ రెడ్డితో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతున్నాడు. టికెట్ ఆశించి అలకబూనిన అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డిని అధిష్టానంతో మాట్లాడించి మచ్చిక చేసుకున్న పొన్నం ప్రభాకర్ ఎలాగైనా ఈసారి గెలవాలని పట్టుదలతో ఉన్నారు.

మోదీ పథకాలే గట్టెక్కిస్తాయి

హుస్నాబాద్ బీజేపీ అభ్యర్థి బొమ్మ శ్రీరాంచక్రవర్తి మొదటిసారి ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలోకి దిగారు. శ్రీరాంచక్రవర్తి తండ్రి బొమ్మ వెంకటేశ్వర్లు 1999లో ఎమ్మెల్యేగా గెలుపొందారు. బొమ్మ వెంకటేశ్వర్లు వారసుడిగా ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. తన తండ్రి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో చేసిన అభివృద్ధి, అయనకు ఉన్న పరిచయాలు తనకు కలిసి వస్తాయని ముందుకు సాగుతున్నారు. తండ్రి తర్వాత కాంగ్రెస్ హుస్నాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ప్రజల్లో ఉంటూ సమస్యలపై పోరాటాలు చేశారు. కాంగ్రెస్‌ని అంటిపెట్టుకొని పార్టీ బలోపేతం కోసం కృషి చేశారు. తదనంతరం జరిగిన పరిణామాలతో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ ప్రోద్బలంతో శ్రీరాంచక్రవర్తి బీజేపీలో చేరారు. పార్టీ టికెట్ రావడంతో ప్రచారం ముమ్మరంగా చేస్తున్నారు. ప్రధాని మోదీ పథకాలు, అభివృద్ధి పనులను జనంలోకి తీసుకెళ్తూ ప్రచారం చేస్తున్నారు.

జంగ్ తెలంగాణ

ఖేడ్ కాంగ్రెస్‌లో కుదిరిన సయోధ్య

- టికెట్ త్యాగం చేసిన సురేశ్ షెట్కార్
- అభ్యర్థిగా పట్లోళ్ల సంజీవరెడ్డి

నారాయణఖేడ్: నారాయణఖేడ్ కాంగ్రెస్ అభ్యర్థికి సంబంధించి శుక్రవారం ఊహించని విధంగా అనూహ్య పరిణామాలు చోటు చేసుకున్నాయి. పార్టీ టికెట్ కోసం మాజీ ఎంపీ, టీపీసీసీ ఉపాధ్యక్షుడు సురేశ్ షెట్కార్, మరో ఉపాధ్యక్షుడు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి పోటీపడ్డారు. అధిష్టానం సురేశ్ షెట్కార్‌ను అభ్యర్థిగా ప్రకటించి బీ–ఫామ్ సైతం అందజేసింది. వారం రోజులుగా ఇద్దరి మధ్య సయోధ్యకు కాంగ్రెస్ పెద్దలు యత్నించినా ఫలించలేదు. దీంతో కాంగ్రెస్ తరఫున సురేశ్ షెట్కార్, స్వతంత్ర అభ్యర్థిగా సంజీవరెడ్డి శుక్రవారం నామినేషన్ వేయడానికి నిర్ణయించుకొని అవసరమైన ఏర్పాట్లు చేసుకున్నారు. ఈ మేరకు నియోజకవర్గంలోని తమ తమ కార్యకర్తలను ఖేడ్‌కు పిలిపించుకున్నారు. ఉదయం సురేశ్ షెట్కార్, సంజీవరెడ్డిలతోపాటు వారి కుటుంబసభ్యులు పంచగామకు వెళ్లి చర్చించుకున్నారు. పదేళ్లుగా తమ మధ్య వర్గవిభేదాల కారణంగా కార్యకర్తలు తీవ్ర అన్యాయానికి గురవుతున్నారని, అందుకే కలిసికట్టుగా ఉండి బీఆర్ఎస్ దౌర్జన్యాలను ఎదుర్కోవాల్సిన అవసరం ఉందని నిర్ణయించుకున్నారు. తాను ఇదివరకు జహీరాబాద్ ఎంపీగా పని చేసినందున వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లోనూ ఎంపీగా పోటీ చేస్తానని, తనకు వచ్చిన టికెట్‌ను సంజీవరెడ్డికి ఇస్తున్నట్లు షెట్కార్ అధిష్టానవర్గానికి వివరించారు. దీంతో అధిష్టానం ఆగమేఘాలమీద సంజీవరెడ్డి పేరిట బీ–ఫామ్‌ను పంపింది. సురేశ్ షెట్కార్, సంజీవరెడ్డిలు తమ తమ సోదరులతో కలిసి వెళ్లి సంజీవరెడ్డి నామినేషన్‌ను దాఖలు చేశారు.

టికెట్లు అమ్ముకున్న కాంగ్రెస్


గజమాలతో చంటి క్రాంతికిరణ్

- అధికారంలోకి వస్తే రాష్ట్రాన్ని అమ్ముతుంది
- అందోల్ బీఆర్ఎస్ అభ్యర్థి చంటి క్రాంతికిరణ్
- భారీ ర్యాలీతో నామినేషన్ దాఖలు

జోగిపేట (అందోల్): టిక్కెట్లు అమ్ముకున్న కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రాష్ట్రాన్నే అమ్ముకుంటుందని అందోల్ బీఆర్ఎస్ అభ్యర్థి చంటి క్రాంతికిరణ్ విమర్శించారు. అందోల్ నియోజకవర్గ శాసన సభ స్థానానికి బీఆర్ఎస్ పార్టీ తరఫున చంటి క్రాంతి కిరణ్ నామినేషన్ దాఖలు చేశారు. చాముండేశ్వరి దేవాలయంలో నామినేషన్ పత్రాలకు సతీమణి పద్మావతితో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జోగిపేట పార్టీ కార్యాలయం నుంచి ప్రత్యేక చైతన్య రతంలో ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదవి వ్యామోహంతో ఉన్న దామోదర్‌కు ఓటమి భయం పట్టుకుందని ఆరోపించారు. ఎలాగైనా గెలవాలని దామోదర్ సర్పంచ్‌కు రూ.5 లక్షలు, జెడ్పీటీసీకి రూ.20 లక్షలు, కౌన్సిలర్‌కి రూ.25 లక్షలు ఇస్తానని ఆశ చూపుతున్నాడని మండిపడ్డా రు. దామోదర్ కు చిత్తశుద్ధి ఉంటే అవే రూ.200 కోట్లు అందోల్ నియోజకవర్గ అభివృద్ధికి ఇవ్వాలని సూచించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ హ్యాట్రిక్‌సాధిస్తుందని, ఎన్నికల ప్రచారానికి అన్ని వర్గాల నుంచి అపూర్వ స్పందన వస్తుందన్నారు. ర్యాలీలో కార్యకర్తలతో కలిసి ఎమ్మెల్యే అభ్యర్థి క్రాంతికిరణ్, ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ భిక్షపతి డాన్సులు స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచాయి. కార్యక్రమంలో ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ జగన్మోహన్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు రాహుల్ కిరణ్, జైపాల్‌రెడ్డి, కాశీనాథ్, జోగిపేట మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లె సంజీవయ్య, జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర నాయకులు మారుతీసాగర్ పాల్గొన్నారు.

రాజన్న.. చక్రం తిప్పన్న


కుమ్మరి సారెపై కుండ చేస్తున్న రాజనర్సు

సిద్దిపేట బీఆర్ఎస్ అభ్యర్థి హరీశ్‌రావును భారీ మెజార్టీతో గెలిపించుకుందామని సిద్దిపేట మున్సిపల్ మాజీ చైర్మన్ కడవేర్గు రాజనర్సు అన్నారు. శుక్రవారం పట్టణంలోని 35, 36వ వార్డుతోపాటు పలు వార్డుల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అలాగే, రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుమ్మరి సారేపై కుండలు చేస్తూ, లాండ్రీ షాపు వద్ద ఇస్త్రీ చేస్తూ హరీశ్‌రావుకు మద్దతుగా కారు గుర్తుకు ఓటు వేయాలని ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

–సిద్దిపేటకమాన్

అక్కా.. ఓటు కారుకే


బీడీలు చుడుతున్న నాయకులు

మండల పరిధిలోని కమలాయపల్లిలో జనగామ బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డికి మద్దతుగా శుక్రవారం బీఆర్ఎస్ గ్రామ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓ ఇంటి ఎదుట బీడీలు చుడుతున్న మహిళల వద్దకు వెళ్లి కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే రూ.2 వేలు ఉన్న పెన్షన్ రూ.5వేలు అవుతుందని చెప్పారు. –చేర్యాల(సిద్దిపేట)

బీఆర్ఎస్‌లోకి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు


మంత్రి కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జనార్దన్‌రెడ్డి, పక్కన దేవేందర్‌రెడ్డి

మంత్రి కేటీఆర్ సమక్షంలో చేరిన జనార్దన్‌రెడ్డి

రామాయంపేట(మెదక్): బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నందు జనార్దన్‌రెడ్డి తన అనుచరులతో కలిసి శుక్రవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ జనార్దన్‌రెడ్డికి కండువా కప్పిపార్టీలోకి ఆహ్వానించారు. మెదక్ పార్టీ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి గెలుపుకోసం సమష్టిగా కృషి చేయాలని మంత్రి కేటీఆర్ ఆయనకు సూచించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకుడు, ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి, కల్వకుంట సహకార సంఘం అధ్యక్షుడు అంది కొండల్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు పాడెండ్ల లక్ష్మణ్ యాదవ్, వెంకట్‌రెడ్డి, రమేశ్‌గుప్తా, తదితరులు పాల్గొన్నారు.

హరీశ్‌రావు పిట్టకథలు నమ్మరు


మాట్లాడుతున్న రఘునందన్‌రావు

- ఆశీర్వదిస్తే అన్నిరంగాల్లో అభివృద్ధి
- దుబ్బాక బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు

దుబ్బాకటౌన్: సిద్దిపేట పెత్తనం మనకెందుకు.. ఇప్పటికే దుబ్బాక చైతన్యం, పౌరుషం చూపించాం అదిమరిచి మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతున్నాడని దుబ్బాక బీఆర్ఎస్ అభ్యర్థి రఘునందన్ రావు అన్నారు. శుక్రవారం అక్బర్‌పేట– భూంపల్లి మండలంలోని పోతారెడ్డిపేట, చిన్ననిజాంపేట, రామేశ్వరంపల్లి గ్రామాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా జరిగిన ప్రచార సభల్లో ఆయన మాట్లాడారు. మంత్రి హరీశ్‌రావు దుబ్బాకలో ఎన్ని పిట్ట కథలు చెప్పినా ప్రజలు నమ్మరని అన్నారు. ఉపఎన్నికలో కర్రు కాల్చి వాతపెట్టారని గుర్తు చేశారు. దుబ్బాకపై ప్రభుత్వానికి మొదటి నుంచి సవతిపల్లి ప్రేమే అని విమర్శించారు. మరోసారి ఆశీర్వదించి గెలిపిస్తే అండగా ఉంటానని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ఎన్ని ప్రలోభాలు పెట్టినా, మాయమాటలు చెప్పినా నమ్మవద్దన్నారు.

భారీగా చేరికలు

దుబ్బాక మండలం బల్వంతాపూర్ సర్పంచ్ భర్త కిష్టయ్యతో పాటు ఉపసర్పంచ్ దండుగుల యాదగిరి, వార్డు సభ్యులు అలాగే రఘోత్తంపల్లి ఉపసర్పంచ్ కంపె కవిత పర్శరాములు, పద్మశాలిగడ్డకు చెందిన 30 మంది బీఆర్ఎస్ నాయకులు రఘునందన్ రావు సమక్షంలో బీజేపీలో చేరారు.

దుబ్బాక గడ్డపై మరోసారి..

మిరుదొడ్డి(దుబ్బాక): దుబ్బాక గడ్డపై మరోసారి బీజేపీ జెండా ఎగరడం ఖాయమని ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్‌రావు ధీమా వ్యక్తం చేశారు. అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలోని కూడవెల్లిలో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉపసర్పంచ్ చెరుకు యాదగిరితో పాటు పలువురు బీఆర్ఎస్ కార్యకర్తలు బీజేపీలో చేరగా కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీలో దుబ్బాక సమస్యలపై గొంతు విప్పి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మల్లన్నగారి భిక్షపతి, కృష్ణ, స్వరూప, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అండగా ఉంటా..

చేగుంట(తూప్రాన్): ఆదరించి గెలిపిస్తే అన్ని గ్రామాల ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేస్తానని దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు అన్నారు. మండలంలోని చిన్నశివునూర్, మక్కరాజీపేట గ్రామాల్లో శుక్రవారం రాత్రి రఘునందన్ రావు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దుబ్బాక ఎమ్మెల్యేగా గెలిచిన రెండున్నరేళ్లు ప్రజల మధ్యనే ఉండి వారి సమస్యలను పరిష్కరించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు భూపాల్, మాజీ ఎంపీపీ పాండు, వైస్ ఎంపీపీ రాంచంద్రం, గణేశ్ రవికుమార్, నాయకులు వెంగళ్‌రావు, సంతోష్‌రెడ్డి, గోవింద్, నాయకులు పాల్గొన్నారు.

బీజేపీలోనే కార్యకర్తలకు గుర్తింపు



రఘునందన్ రావుతో కలిసి నామినేషన్ వేస్తున్న శ్రీకాంత్ రెడ్డి

సిద్దిపేటజోన్: బీజేపీలోనే కార్యకర్తలకు మంచి గుర్తింపు ఉంటుందని, అవసరమైతే పోటీ చేసేందుకు టికెట్లు వస్తుందని దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్ రావు పేర్కొన్నారు. శుక్రవారం సిద్దిపేట బీజేపీ అభ్యర్థి శ్రీకాంత్ రెడ్డి నామినేషన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బీఆర్ఎస్‌లో వారసత్వ రాజకీయాలు ఉంటాయని, అక్కడ వంద ఏళ్లు అయినా కార్యకర్తలకు టికెట్లు రాదని ఆరోపించారు. తండ్రి పోతే కొడుకు, కొడుకు పోతే మనువడు వస్తారని విమర్శించారు. అభ్యర్థి శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ... సిద్దిపేటలో డబ్బులున్న వారికి, పేదవానికి మధ్య పోటీ జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ వెంకట్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో నాయకులు రామచందర్ రావు, విద్యాసాగర్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

- భూ పరిపాలనశాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్
- రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు ప్రారంభం


పోటీలను ప్రారంభిస్తున్న నవీన్ మిట్టల్, కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

సిద్దిపేటఎడ్యుకేషన్: క్రీడలు విద్యార్థుల జీవితాల్లో అంతర్భాగం కావాలని, చదువుతోపాటు క్రీడల్లో ముందుంటే శారీరక, మానసిక దృఢత్వం ఉంటుందని ఇంటర్మీడియట్ విద్యాశాఖ కమినర్, భూపరిపాలన, స్టాంప్‌లు, రిజిస్ట్రేషన్ శాఖ ముఖ్య కార్యదర్శి, సీనియర్ ఐఏఎస్ నవీన్‌మిట్టల్ అన్నారు. స్థానిక ప్రభుత్వ బాలికల కళాశాలలో శుక్రవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి వాలీబాల్ అండర్ –19 (ఎస్‌జీఎఫ్) జూనియర్ కళాశాలల ఫెడరేషన్ క్రీడా పోటీల ప్రారంభోత్సవానికి కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్‌తో కలిసి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబర్చాలని, గెలిచిన వారిని చూసి అసూయ పడకుండా వారిని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కలెక్టర్ ప్రశాంత్‌జీవన్ పాటిల్ మాట్లాడుతూ క్రీడాకారులకు స్పోర్ట్స్ కిట్లు అందిస్తున్నామని చెప్పారు. వాటిని సద్వినియోగం చేసుకొని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. జిల్లాలోని స్విమ్మింగ్ ఫూల్‌ను వినియోగించుకొని మెళకువలు నేర్చుకోవాలన్నారు. తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్(టీజీఎల్ఏ)రాష్ట్ర అధ్యక్షుడు కనకచంద్రం మాట్లాడుతూ.. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నుంచి అండర్ –19 క్రీడలను ఇంటర్ విద్యార్థులతో నిర్వహించిన ఘనత సిద్దిపేటకే దక్కిందన్నారు. అలాగే, జిల్లా ఇంటర్ విద్యాధికారి, అండర్ –19 క్రీడల చైర్మన్ సూర్యప్రకాశ్, కార్యదర్శి సమ్మయ్య, డీవైఎస్ఓ నాగేందర్, ప్రిన్సిపల్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కూచంగారి శ్రీనివాస్ తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్స్ సత్యనారాయణరెడ్డి, శారద, సురేష్‌రెడ్డి, భూపాల్‌రాజు, బుచ్చిరెడ్డి, రాష్ట్ర వాలీబాల్ అసోసియేషన్ రెఫరీ బోర్డు కన్వీనర్ రవీందర్‌రెడ్డి, క్రీడా పోటీల ఇన్‌చార్జి వెంకటేశ్ వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తల్లీ దీవించమ్మా..

శివ్వంపేట(నర్సాపూర్): బీఆర్ఎస్ నర్సాపూర్ అభ్యర్థి సునీతాలక్ష్మారెడ్డి శుక్రవారం మండల పరిధి దొంతి వేణుగోపాలస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. నామినేషన్ వేసే ముందు ఆలయంలో పూజలు చేయడం ఆమెకు ఆనవాయితీ. కుటుంబ సభ్యులతో పూజలనంతరం నామినేషన్ వేసేందుకు వెళ్లారు.

చిన్నకోడూరు(సిద్దిపేట): సిద్దిపేట బీఆర్ఎస్ అభ్యర్థి మంత్రి హరీశ్‌రావు భారీ మెజార్టీతో విజయం సాధించాలని శుక్రవారం మండల పరిధిలోని అనంతసాగర్ సరస్వతీ క్షేత్రంలో జెడ్పీచైర్‌పర్సన్ రోజాశర్మ పూజలు చేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


పూజలు చేస్తున్న సునీతారెడ్డి


పూజలు చేస్తున్న రోజాశర్మ